క్లుప్తంగా

పీహెచ్‌సీ పనులు ప్రారంభం



ఉంగుటూరు: ఇందుపల్లి పీహెచ్‌సీ పనులను ఎంపీడీవో శేషగిరిరావు గురువారం ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు రూ.8 లక్షలతో అంతర్గత రహదారి, మెరక, జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్ పనులు వేగంగా చేయాలని, త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు వెంకట్రామయ్య, పీహెచ్‌సీ డాక్టర్లు శిరీష, సుబ్బారావు, గ్రామ పెద్దలు మండవ ప్రసాద్, అట్లూరి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన ఉండాలి



గన్నవరం రూరల్: విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ కె.ఆనంద్‌బాబు సూచించారు. మండలంలోని సూరంపల్లి ఎంపీపీ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఆహారం తినే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని, క్రమశిక్షణతో చదవాలని చెప్పారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

కంకిపాడు: ప్రతిభావంతులను ఆదుకోవటం, చేయూత అందించటం సామాజిక బాధ్యత అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉయ్యూరు మండలం చిన ఓగిరాల గ్రామానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని పాలడుగు కీర్తి చదువు నిమిత్తం డాక్టర్ చిగురుపాటి లక్ష్మీనారాయణ రూ.5 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందించారు. ఈ సాయాన్ని చిన ఓగిరాల పీహెచ్‌సీ డాక్టర్ శ్వేత, ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్ కుమార్ విద్యార్థిని తాత సాంబశివరావుకు కంకిపాడులో గురువారం అందజేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు చేయూత అందిస్తే విజయాలను సాధిస్తారని, ప్రతిభకు ఆర్థిక సమస్య అడ్డుకాకూడదని డాక్టర్ శ్వేత, ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ పేర్కొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి



పెనమలూరు: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని డాక్టర్ జాస్మిన్‌సుల్తానా సూచించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి ఏడాది విద్యార్థులకు 'మహిళల ఆరోగ్యం – ఇనుము లోపం – రక్తహీనత'పై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. డాక్టర్ జాస్మిన్‌సుల్తానా మాట్లాడుతూ.. 18, 19 సంవత్సరాల వయస్సు కలిగిన యువతులు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇనుము, రక్తహీనత ఏర్పడితే తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. మంచి ఆహారపు అలవాట్లు పాటిస్తూ, నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థినులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

పెనమలూరు: మండలంలోని కానూరులో ఓ యువతి అదృశ్యమైన ఘటనపై పెనమలూరు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కానూరు మురళీనగర్‌లో 21 ఏళ్ల యువతి తన తల్లిదండ్రులతో నివసిస్తోంది. డిగ్రీ చదువుతున్న ఆ యువతి ఇటీవల ఓ యువకుడితో ఇంటి నుంచి వెళ్లిపోయింది. పటమట పోలీసులు ఆమెను తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అప్పటి నుంచి తల్లిదండ్రులు ఆమెను కాలేజీకి పంపడంలేదు. ఈ నెల ఆరో తేదీ ఉదయం యువతి ఇంటి నుంచి వెళ్లిపోయింది. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: మండలంలోని కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. విజయవాడ సూర్యారావుపేటలో నివసించే బోయపాటి వెంకట అభిలాష్ విజయవాడలో ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తున్నాడు. అతని తల్లిదండ్రులు గుడివాడలో ఉంటారు. తన మిత్రుడు బొబ్బా వెంకట రమణతో కలిసి అభిలాష్ మంగళవారం సాయంత్రం బైక్ పై మిత్రుడిని కలిసేందుకు కంకిపాడు వెళ్లాడు. అక్కడి నుంచి ఇద్దరూ బైక్ పై విజయవాడకు తిరిగి బయలుదేరారు. కానూరు ఇంజినీరింగ్ కాలేజీ వద్దకు రాగా పక్కగా వచ్చిన లారీ వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ పై ఉన్న అభిలాష్, వెంకటరమణ రోడ్డు పై పడి ఇద్దరూ గాయాలపాలయ్యారు. బాధితులను 108 సిబ్బంది విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అభివృద్ధికి ఉపాధి వేదిక

- పెనమలూరు నియోజకవర్గంలో జోరుగా ఉపాధి హామీ పథకం పనులు
- అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.1.8 కోట్ల నిధులు
- మ్యాచింగ్ గ్రాంట్‌గా మరో రూ.33 లక్షలు విడుదల
- 20 అభివృద్ధి పనులకు శ్రీకారం

పెనమలూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద పెనమలూరు నియోజకవర్గానికి ప్రభుత్వం రూ.1.80 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో పలు గ్రామాల్లో అంతర్గత రహదారులు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ మేరకు అధికారులు అంచనాలు రూపొందించారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రత్యేక దృష్టి సారించి అధికారులతో చర్చించి అత్యవసరంగా చేపట్టాల్సిన అంతర్గత రహదారులను గుర్తించారు. ఈ నిధులతో 19 గ్రామాల్లో 20 అభివృద్ధి పనులు చేపడతారు. అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారులకు మోక్షం కలిగించి ప్రజలకు సౌకర్యం కలిగించనున్నారు. ఉపాధి నిధులకు తోడు రూ.33 లక్షల నిధులను పెనమలూరు మండలంలో మ్యాచింగ్ గ్రాంట్‌గా మంజూరు చేశారు.

ఆరు పనులకు రూ.60 లక్షలు

పెనమలూరు మండలంలో ఆరు అభివృద్ధి పనులకు రూ.60 లక్షల ఉపాధి నిధులు కేటాయించారు. పెదపులిపాక శ్రీనగర్‌కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.7 లక్షలు, పంచాయతీ నిధులు మరో రూ.5 లక్షలు, గ్రామంలోని ఎస్సీ కాలనీలో డ్రెయిన్‌కు రూ.8 లక్షల ఉపాధి నిధులు, పంచాయతీ గ్రాంట్ రూ 8 లక్షలు, వణుకూరు బీసీ కాలనీలో సీసీ రోడ్డుకు రూ.15 లక్షలు, గోసాల సాయినగర్ కాలువ కట్ట రోడ్డకు రూ.15 లక్షల ఉపాధి నిధులు కేటాయించారు. ఈ నిధులకు మండల, పంచాయతీ నిధులు రూ.20 లక్షలను మ్యాచింగ్ గ్రాంట్‌గా జోడించారు. గంగూరులో మహిళా మండలి కట్టపై రోడ్డుకు రూ.5 లక్షలు, పెనమలూరు జగనన్న కాలనీలో కల్వర్టులకు రూ.10 లక్షలు మంజూరు చేశారు.



ఉప్పలూరులో సీసీ రోడ్డు నిర్మించే అంతర్గత రహదారి

కంకిపాడులో..

కంకిపాడు మండలానికి ఉపాధి హామీ పథకం నిధులు రూ.60 లక్షలు కేటాయించారు. కంకిపాడు టౌన్‌లో సీసీ రోడ్లకు రూ.10 లక్షలు, నెప్పల్లిలో సీసీ రోడ్లకు రూ.5 లక్షలు, జగన్నాథపురం బీసీ కాలనీ రోడ్డుకు రూ.8 లక్షలు, మంతెన డొంక రోడ్డుకు రూ.10 లక్షలు, కోలవెన్నులో అంతర్గత రోడ్లకు రూ.7 లక్షలు, ఉప్పులూరు జగనన్న కాలనీ రోడ్డుకు రూ.12 లక్షలు, ప్రొద్దుటూరులో డ్రెయిన్‌కు రూ.8 లక్షల చొప్పున మంజూరు చేశారు.

త్వరలో నిర్మాణ పనులు



పెనమలూరు నియోజకవర్గానికి మంజూరు చేసిన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో త్వరలో అభివృద్ధి పనులు చేపడతాం. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేస్తాం. ప్రధానంగా గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణం చేస్తాం.

– కె.శ్రీనివాస్, డీఈ, పీఆర్ శాఖ

ఉయ్యూరులో..

ఉయ్యూరు మండలంలో ఏడు అభివృద్ధి పనులకు కూడా రూ.60 లక్షలు మంజూరు చేశారు. ఆకునూరులో అంతర్గత రహదారులకు రూ.10 లక్షలు, ముదునూరులో రోడ్లకు రూ.10 లక్షలు, సాయిపురంలో రోడ్లకు రూ.4 లక్షలు, కడవకొల్లు, వీరవల్లిలో రోడ్లకు రూ.15 లక్షలు, చిన ఓగిరాలలో అంతర్గత రోడ్లకు రూ.6 లక్షలు, కలవపాములలో రోడ్లకు రూ.10 లక్షలు, పెద ఓగిరాలలో రోడ్లకు రూ.5 లక్షలు చొప్పున నిధులు కేటాయించారు.

మంత్రి రోజాకు ఘన స్వాగతం



రాష్ట్ర మంత్రి రోజాకు జ్ఞాపిక అందజేస్తున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి



ఆకునూరులో లబ్ధిదారికి ఇంటి పట్టా అందజేస్తున్న మంత్రి రోజా

ఉయ్యూరు: పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్.కె.రోజాకు ఉయ్యూరు మండలం ఆకునూరులో ఘనస్వాగతం లభించింది. పెనమలూరు నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశానికి గురువారం హాజరైన ఆమెకు కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి జ్ఞాపిక అందించి సత్కరించారు. తొలుత పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. సమీక్ష సమావేశంలో భాగంలో పలువురు లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేశారు. అభివృద్ధి సంక్షేమంలో మహానేత వైఎస్సార్ ఒక అడుగు వేస్తే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగడుగులు వేస్తున్నారని మంత్రి ఆర్.కె.రోజా స్పష్టంచేశారు.

వెయ్యి వాట్స్ విద్యుత్ వినియోగం ఉచితం

నున్న(విజయవాడరూరల్): జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు వెయ్యి వాట్స్(ఒక కిలోవాట్) విద్యుత్ వరకు ఉచితంగా వినియోగించుకోవచ్చని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(కన్‌స్ట్రక్షన్) ఎం.వసంతరావు చెప్పారు. గురువారం నున్న గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో లబ్ధిదారుల విద్యుత్ కనెక్షన్ల కోసం రిజిస్ట్రేషన్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఈ వసంతరావు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో నివసించే కుటుంబాల కోసం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడానికి నున్న, సూరంపల్లి గ్రామాల్లోని లేఅవుట్లలో రెండు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించిందని తెలిపారు. ఒక్కో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.30 కోట్ల చొప్పున కేటాయించిందన్నారు. రూ. 85 లక్షలతో విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారని వివరించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తైన వారు ఇంటిపట్టా జిరాక్స్, ఆధార్‌కార్డ్ జిరాక్స్, ఇంటిగుర్తింపు కార్డులను విద్యుత్‌శాఖ కార్యాలయంలో అందజేసే రూ.2,400 విలువ చేసే ఫ్యూజుబాక్సు, విద్యుత్ మీటరు, సర్వీసువైరును ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ఇప్పటి వరకు 110 సర్వీసులకు రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయని డీఈ డి.బాలాజీనాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఏడీ ప్రభు, ఏఈ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ మీటర్ల సర్వీసు రిజిస్ట్రేషన్ చేస్తున్న ఈఈ ఎం.వసంతరావు, ఏడీ ప్రభు

ఎమ్మెల్యే వంశీ ఆర్థిక సాయం

పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు నివాసి నల్లమోతురాజుకు మెరుగైన వైద్యం చేయించడానికి గురువారం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ. 20 వేల సాయం అందజేశారు. షుగర్ వ్యాధితో కారణంగా రాజు చేతుల్లో రక్తం గడ్డలు కట్టి బాధపడుతున్న విషయాన్ని అతని కుటుంబసభ్యుల ద్వారా ఎమ్మెల్యే వంశీమోహన్ తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంటనే విజయవాడలోని ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్లకు ఫోను చేసి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అతని కుటుంబ సభ్యులకు రూ.20 వేలను ఎమ్మెల్యే వంశీ అందజేశారు.

ముగిసిన ఎల్ఐసీ వారోత్సవాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల ఒకటో తేదీ నుంచి నిర్వహించిన వారోత్సవాలు గురువారం ముగిశాయి. విజయవాడ బెంజిసర్కిల్ సమీపంలోని ఎల్ఐసీ బ్రాంచి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా పాలసీదారుల సమావేశం, పాలసీదారుల సర్వీసు క్యాంపు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



రామవరప్పాడులో జరిగిన పూజల్లో గన్నవరం ఎమ్మెల్యే వంశీ మోహన్ తదితరులు

పెనమలూరు: మండలంలోని పోరంకిలో వేంచేసి ఉన్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామికి ఉదయం పంచామృతాభిషేకం చేసి చందనంతో విశేష అలంకరించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు వేదాంతం సార్వభౌమ దినేష్ ఆచార్యులు ప్రసాదాలు అందజేశారు. పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ విజయరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు శ్రీకృష్ణ భగవానుడికి అర్చన, గీతాపారాయణ చేశారు. శ్రీ వాసుదేవానందగిరిస్వామీజీ ఆధ్వర్యంలో స్వామికి ప్రసాదాలు నివేదించారు.

విజయవాడ రూరల్ మండలంలో..

రామవరప్పాడు: రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. రామవరప్పాడు వంతెన సెంటర్, కల్యాణి టెంట్ హౌస్ ఆవరణలో సర్పంచ్ వరి శ్రీదేవి పర్యవేక్షణలో రాధాకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ప్రత్యేక పూజలు చేశారు. ఎనికేపాడు వేడుకల్లో ఎమ్మెల్యేలు పార్థసారథి, వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్, గొల్లపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, పిళ్లంగొళ్ల లక్ష్మి, లాకా వెంగళరావు పాల్గొన్నారు.

నున్నలో..

నున్న(విజయవాడరూరల్): స్థానిక చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి ఆలయంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. వేదపాఠశాల విద్యార్థులు ఆలయం ప్రాంగణంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఆనందోత్సాహాలతో చేశారు. నున్నలోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో, పి.నైనవరంలో రామాలయం సెంటర్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి.



పోరంకిలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు

అశ్వవాహనంపై..

గన్నవరం: స్థానిక యాదవులపేట రామాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన అశ్వ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ప్రారంభించారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు యాదవులపేట, గొడపేట, కొత్తపేట మీదుగా కొనసాగింది. సంఘ పెద్దలు చిమట గంగాధర్, సర్నాల రమేష్, వార్డు సభ్యులు చిమట శ్రీనివాసరావు, సీతారామయ్య, పిన్నిబోయిన కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు మండలంలో..

కంకిపాడు: కృష్ణాష్టమి పర్వదినాన్ని మండలంలోని పలు గ్రామాల భక్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. కోలవెన్ను గ్రామంలో వైఎస్సార్ సీపీ యువత రామ్–లక్ష్మణ్ యూత్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపించారు. ఈ సందర్భంగా వెయ్యిమంది పేదలకు అన్నదానం, అల్పాహార పంపిణీ నిర్వహించారు. మండలంలోని మంతెన, ఈడుపుగల్లులో కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టికొట్టే వేడుక, గ్రామోత్సవం కనుల పండువగా సాగింది.



కోలవెన్నులో అన్నదానం నిర్వహిస్తున్న రామ్-లక్ష్మణ్ యూత్



పెదపులిపాకలో పూజలు నిర్వహిస్తున్న వాసుదేవానందగిరి స్వామీజీ



ఉట్టికొడుతున్న వేద పాఠశాల విద్యార్థులు

సమతుల ఆహారంతో ఆరోగ్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: సమతుల ఆహారంతో ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని ఎఫ్‌సీఐ హనుమాన్‌జంక్షన్ డిపో క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ ఎస్.హేమమాధురి అన్నారు. నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో ఎఫ్‌సీఐ ఆధ్వర్యాన గురువారం ఫోర్టిఫైడ్ రైస్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు సమతౌల్య ఆహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకం ద్వారా మధ్యాహ్న భోజనానికి ఫోర్టిఫైడ్ రైస్ సరఫరా చేస్తోందని హేమ మాధురి వివరించారు. ఎఫ్‌సీఐ అధికారులు రూప్లా నాయక్, శివ భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు సత్వర సేవలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఖాతాదారులకు మెరుగైన సేవలు సత్వరం అందించడంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందంజలో ఉంటుందని హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్ మేనేజర్ బొడ్డేపల్లి నరేష్‌కుమార్ అన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా 118వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్‌లో ఘనంగా నిర్వహించారు. బ్యాంకుకు విచ్చేసిన ఖాతాదారులకు గులాబీ పుష్పాలు అందించి సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం జరిగిన ఖాతాదారుల సమావేశంలో సూపర్ సీనియర్ సిటిజన్ కస్టమర్ ఓలేటి సీతారామస్వామి కేక్ కోశారు. హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్‌లో 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.120 కోట్ల టర్నోవర్ సాధించామని మేనేజర్ నరేష్‌కుమార్ తెలిపారు. అనంతరం పలువురు ఖాతాదారులకు నూతనంగా మంజూరైన రుణాల పత్రాలను పంపిణీ చేశారు. శేరినరసన్నపాలెం సర్పంచ్ అడపా అంజిబాబు, అసిస్టెంట్ మేనేజర్ ఆకాష్, సిబ్బంది గాయత్రి, విద్యాబాల, మౌనీష్, ప్రవీణ్, అజయ్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

ప్రగతి బాటలు

- గ్రామాల వృద్ధికి మండల పరిషత్ రూ.10.80 కోట్ల కేటాయింపు
- రూ.4.68 కోట్ల విలువైన పనులు పూర్తి
- వివిధ దశల్లో రూ.6.12 కోట్ల పనులు



రాయ్‌నగర్‌లో నిర్మించిన బీటీ రోడ్డు



తెంపల్లిలో రోడ్డుకిరువైపులా డ్రెయిన్



పామర్తినగర్‌లో నిర్మించిన సీసీ రోడ్డు

గన్నవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రోడ్లు, కాలువలు, తాగునీరు, అంగన్‌వాడీలు, పాఠశాలల అభివృద్ధికి అవసరమైన నిధులను మండల పరిషత్ కేటాయిస్తోంది. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంపీపీ అనగాని రవి నేతృత్వంలోని మండల పరిషత్ పాలకవర్గం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. రెండేళ్లలో మండలంలోని 21 పంచాయతీల్లో అభివృద్ధి పనుల కోసం మండల పరిషత్ రూ.10.80 కోట్లు కేటాయించింది. వీటిలో రూ.4.68 కోట్ల విలువైన పనులు పూర్తవగా, మరో రూ.6.12 కోట్ల పనులు వివిధ దశలో ఉన్నాయి.

రోడ్లు, కాలువల నిర్మాణానికి అధిక నిధులు

గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు, కాలువల నిర్మాణానికి అధిక నిధులు వెచ్చించారు. గన్నవరంలోని రాయ్‌నగర్ అంతర్గత రోడ్లను గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 20 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ. 18 లక్షలతో బీటీ రహదారులుగా అభివృద్ధి చేశారు. మర్లపాలెంలో రూ. 20 లక్షలతో, సావారిగూడెంలో రూ. 10 లక్షలతో, తెంపల్లిలో రూ. 40 లక్షలతో డ్రెయిన్లను నిర్మించారు. గన్నవరం ముస్లిం షాదీఖానాను రూ.10 లక్షలు, కట్టుబడిపాలెంలో అంతర్గత రోడ్లను రూ.18 లక్షలతో అభివృద్ధి చేశారు. వీరపనేనిగూడెంలో రూ.10 లక్షలు, సూరంపల్లిలో రూ.7 లక్షలు, కొత్తగూడెంలో రూ. 6 లక్షలు, వీఎన్. పురంలో రూ.6 లక్షలు, గొల్లనపల్లిలో రూ. 34 లక్షలతో సీసీ రోడ్లను నిర్మించారు. గోపవరపుగూడెంలో రూ. 15 లక్షలతో సీసీ రోడ్లు, రూ. 16 లక్షలతో తారు రోడ్డు నిర్మాణం చేశారు. ఇంకా పెద్ద ఎత్తున్న అంతర్గత రోడ్లు, డొంక రోడ్లను అభివృద్ధి చేశారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు

కేసరపల్లి లేఅవుట్‌లో రూ. 13.50 లక్షలతో బోర్లు, మోటర్లను ఏర్పాటు చేయగా, మర్లపాలెం లేఅవుట్‌లో రూ. 13 లక్షలతో అంతర్గత రోడ్లు నిర్మాణం, రూ. 3 లక్షలతో బోర్‌వెల్ ఏర్పాటు చేశారు. తెంపల్లి లేఅవుట్‌ను రూ. 16 లక్షలతో లెవలింగ్ పనులు, రూ. 8 లక్షలతో కొండపావులూరు లేఅవుట్‌కు అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేశారు. బుద్ధవరం దాసులపాక లేఅవుట్‌లో రూ. 14 లక్షలతో అంతర్గత రోడ్లను, రూ. 8 లక్షలతో లేఅవుట్‌కు వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయడంతో పాటు రూ. 3 లక్షలతో బోరు, మోటారు, గొల్లనపల్లి లేఅవుట్‌లో రూ. 3 లక్షలతో బోరు, మోటారు ఏర్పాటు చేశారు. అల్లాపురంలో లేఅవుట్‌కు వెళ్లే రోడ్డును రూ. 6 లక్షలతో, అంతర్గత రోడ్లను రూ. 4 లక్షలతో, జక్కులనెక్కలం లేఅవుట్‌లో రోడ్లను రూ. 2 లక్షలతో అభివృద్ధి చేశారు.

అన్ని గ్రామాల అభివృద్ధే లక్ష్యం



ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సహకారంతో మండల పరిషత్ ద్వారా అన్ని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంతో పాటు తాగునీరు వనరులను మెరుగుపరుస్తున్నాం. జగనన్న కాలనీల్లో అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నాం. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేయడానికి ప్రణాళికాబద్ధంగా వెళ్తున్నాం.

–ఎంపీపీ అనగాని రవి